ప్రజాశక్తి
మంగళవారం 14 మార్చి 2023
5
కర్నూలు

పోలింగ్ ప్రశాంతం...

- ఓటు వేసిన 71 శాతం మంది పట్టభద్రులు, 90 శాతం ఉపాధ్యాయులు
- కర్నూలు ఎస్‌ఎపి క్యాంపు కేంద్రం వద్ద ఉద్రిక్తత

ఆదోనిలో నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకుంటున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కలెక్టరేట్/కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో సోమవారం నిర్వహించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం తరువాత కాస్త ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల కోసం 74 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 27 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. 61,633 మంది పట్టభద్రుల్లో 43,944 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71.30 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 5,391 మంది ఓటర్లు ఉండగా వారిలో 4,866 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.26 శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రుల ఓటింగ్ కోసం సాయంత్రం పోటెత్తడంతో 4 గంటలకు క్యూలైన్‌లో ఉన్న వారికి టోకన్లను పంపిణీ చేసి పోలింగ్‌ను కొనసాగించారు. కర్నూలు జిల్లాలో 4 గంటల తరువాత 29 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సాగింది.

పోలీసులతో పిడిఎఫ్ మద్దతుదారుల వాగ్వాదం

కర్నూలు నగరంలో ఎస్‌ఎపి క్యాంపు పోలింగ్ కేంద్రంలో వైసిపి కార్పొరేటర్లు ఉండటం, పిడిఎఫ్ మద్దతుదారులు పోలింగ్ కేంద్రానికి 500 మీటర్ల దూరం ఉన్నా వెళ్లిపోమని చెప్పడంతో పిడిఎఫ్ మద్దతుదారులు సిఐతో వాగ్వాదానికి దిగారు. వైసిపి కార్పొరేటర్లు బయటకు వెళ్లిపోవడంతో సమస్య సద్దుమనిగింది. పిడిఎఫ్ మద్దతుదారులు అభ్యర్థి ఫోటోతో ఉన్న కార్డులను తగిలించుకోగా వాటిని తీసేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వాదించడంతో పట్టభద్రులు కాని వారు లోపలికి ఎలా వెళ్తారని పిడిఎఫ్ మద్దతుదారులు ఎమ్మెల్యేకు సమాధానం ఇచ్చారు. ఆదోనిలో వైసిపి నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు పార్టీల నాయకులను చెదరగొట్టారు. ఆదోనిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఐడి కార్డు తీసుకురాకపోవడంతో పోలింగ్ అధికారి ఓటు వేసేందుకు అనుమతించలేదు. దాంతో ఆయన ఐడి కార్డు తెచ్చే వరకూ వేచి చూశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కర్నూలు ఇందిరాగాంధీ మున్సిపల్ పాఠశాలలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు క్యూలో వెళ్లి ఓటు వేశారు. దామోదరం సంజీవయ్య హైస్కూల్‌లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, బి.క్యాంప్ బాలికల పాఠశాలలో జెసి రామసుందర్ రెడ్డి, ఆయన భార్య సి.ప్రసన్న ఓటు వేశారు.

పోలింగ్ సరళి పరిశీలన : కర్నూలు కంట్రోల్ రూం నుంచి స్థానిక సంస్థల పోలింగ్ సరళిని ఎన్నికల పరిశీలకు ఎంఎం నాయక్ పరిశీలించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆరు ఆర్డీవో కార్యాలయాల్లో జరుగుతున్న పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ అంశంపై కలెక్టర్, జెసిని అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్‌ను పరిశీలించిన ప్రజాసంఘాల నాయకులు

కర్నూలు నగరంలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. కర్నూలు బి.క్యాంప్ బాలికల పాఠశాల, సిల్వర్ జూబ్లీ కళశాలలో జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం జయరాజు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల పరిశీలించారు.

స్థానిక సంస్థ స్థానానికి 96.43 శాతం..

ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 1178 మంది ప్రజాప్రతినిధులకు గాను 1136 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96.43 శాతం పోలింగ్ నమోదైంది. కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయంలో కర్నూలు మేయర్ బివై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదోని ఆర్‌డిఒ కార్యాలయంలో కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సిఐతో మాట్లాడుతున్న పిడిఎఫ్ మద్దతుదారులు

స్థానిక మండలి పోరు రసవత్తరం

- ఓటర్లను పోలింగ్ సెంటరుకు తీసుకువచ్చిన ఎమ్మెల్యేలు
- 96.43 శాతం పోలింగ్ నమోదు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

స్థానిక సంస్థల మండలి ఎన్నికల పోలింగ్ పైనే అధికార పార్టీ నేతలు దృష్టి కేంద్రీకరించారు. పోలింగ్ కేంద్రానికి ఓటర్లను తీసుకువచ్చి వారిని ఓటు వేయించేంతవరకు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకున్నారు.ఎక్కడ ఓట్లు చీలకుండా అధికార పార్టీ నేతలు ముందస్తు వ్యూహంతో వ్యవహరించారు. సోమవారం జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల మండలి ఎన్నికల్ పోలింగ్ ప్రక్రియను ఆయా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 1178 మంది ఓటర్లు ఈ మండలి స్థానంలో ఉన్నారు. దాదాపుగా 1136 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోలింగ్ శాతం 96.43 శాతంగా నమోదయింది. స్థానిక సంస్థల మండలి స్థానానికి అధికార వైసిపి నుండి డాక్టర్ మధుసూదన్ బరిలో నిలవగా స్వతంత్ర అభ్యర్థులుగా మోహన్ రెడ్డి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి బరిలో నిలిచారు. ఈ స్థానాన్ని అధికార పార్టీ నేతలు ఏకగ్రీవం చేసుకునే ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఎట్టకేలకు పోలింగ్ జరిగిన నేపథ్యంలో ఎలాగైనా ఓటర్లు జారి పోకుండా అధికార పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. ఎమ్మెల్యేల నియోజకవర్గ పరిధిలోని ఎంపిటిసి, జడ్పిటిసిలు వార్డు కౌన్సిలర్లు కార్పొరేటర్లను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ఈ పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు ఒక్కొక్కరికి రూ.50 వేలకు పైగానే ముట్ట చెప్పినట్లు సమాచారం. అయినప్పటికీ క్రాస్ ఓటింగ్ జరగకుండా అధికార పార్టీ నేతలు ముందస్తు చేసుకున్న వ్యూహరచన ప్రకారం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. ఈ పోలింగులోఆ అధికార పార్టీ అభ్యర్థితో పాటు స్వతంత్ర అభ్యర్థులకు కూడా కొన్ని ఓట్లు పోలయినట్లు తెలిసింది.

కర్నూల్ ఆర్డీవో కార్యాలయంలో పోలింగ్ : కరూలు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో కర్నూలు పాణ్యం కోడుమూరు ఎమ్మెల్యేలు హఫీస్ ఖాన్ కాటసాని రాంభూపాల్ రెడ్డి సుధాకర్ లతోపాటు నగర మేయర్ బివై రామయ్య తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తమ కార్పొరేటర్లు ఎంపిటిసి జడ్పిటిసిలతో కలిసి పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుంటున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఆర్‌ఐఒ గురువయ్య శెట్టి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 15 నుండి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఐఒ ఎస్‌వివిఎస్ గురువయ్యశెట్టి పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధారంగా ఇంటర్ పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కర్నూలు ఆర్‌ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాల్లో 23610 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 26057 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 51 పరీక్ష కేంద్రాల్లో12178 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు,14792 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షా పత్రాలను 44 పోలీస్ స్టేషన్లో భద్రంగా భద్రపరిచామన్నారు. ఇందులో 17 పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించగా అందులో కర్నూలు జిల్లాలో 12 కేంద్రాలు నంద్యాల జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలను గుర్తించామన్నారు. దాదాపుగా 124 పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. 17 రూట్లలో విద్యార్థులకు సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సులను కూడా నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 9 గంటల లోగా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆరు ఫ్లయింగ్ స్పాట్స్ , 12 సిట్టింగ్ స్క్వాడ్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకుగాను అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

దొంగ ఓటర్లను జైలుకు పంపాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ప్రజలను తప్పుదోవ పట్టించి దొంగ ఓట్లు వేసే వారిని జైలుకు పంపించాలని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ గాఢ నిద్రలో ఉందన్నారు. ఓటర్లకు ఆధార్ కార్డు చూపకుండా, కొన్ని ప్రాంతాల్లో దొంగ ఓట్లను ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేయించారన్నారు. మేధావులను పంపే శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ లో అనేక చోట్ల బోగస్ ఓట్లు పెద్ద ఎత్తున వేశారన్నారు. ఈ పోలింగ్ లోపడిన దొంగ ఓట్లను తొలగించేందుకు వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా పరిరక్షణ సమితి నాయకులు పద్మనంద యోగి డేవిడ్, ఎం రవిప్రసాద్, శివమణి,గజపతి, రమణారెడ్డి, రాంబుపల్ రెడ్డి, కుమార్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తును పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా కేంద్రంలోని కర్నూలు ఎస్‌టి బిసి కళాశాల, కర్నూలు ఆర్‌డిఒ ఆఫీస్ , దామోదరం సంజీవయ్య మున్సిపల్ హై స్కూల్ , టంగుటూరి ప్రకాశం పంతులు హై స్కూల్ (ప్రకాష్ నగర్)లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ సందర్శించి ఎన్నికల భద్రతలను పరిశీలించారు. ఓటు వేసే క్యూలైనులు, పార్కింగ్ ప్రదేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తీరును జిల్లా ఎస్‌పి సోమవారం పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం విధులు కొనసాగాలని అక్కడ బందోబస్తు విధులలో ఉన్న పోలీసు అధికారులకు సూచించారు. ఎస్‌పి వెంట అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్‌పి యుగంధర్ బాబు, కర్నూలు టూ టౌన్ సిఐ శ్రీనివాసులు ఉన్నారు.

వెనుదిరిగిన ఓటర్లు

జిల్లా కేంద్రంలోని కర్నూలు ఎస్ టి బి సి కళాశాల, కర్నూలు ఆర్‌డిఒ ఆఫీస్ , దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూలులో ఓటు వేసేందుకు ఇబ్బందిపడుతున్న ఓటర్లు.. గంటలకు కొద్ది లైన్లో వేచి ఉన్న ఓటర్లు.. ఓటు వేయకుండానే వెనుతిరిగారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఇ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారాన్ని కోసం డయల్ యువర్ ఎస్‌ఇ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎం.ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న మంగళవారం ఉదయం పది గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు తమ సమస్యలను 7382614 308 నెంబర్‌కు వినియోగదారులు ఫోన్ చేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను అందజేయాలని రిజిస్ట్రార్ సుందరానందపుచ్చా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న డిగ్రీ విద్యార్థులకు తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలను ఇవ్వాలని ప్రిన్సిపాళ్లను ఆయన ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈకార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా నులిపురుగుల మాత్రలు వినియోగించాలని సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఓటు వినియోగించుకున్న జెసి దంపతులు

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.కోటేశ్వరరావు వెల్లడించారు. సోమవారం జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి స్థానాలతో పాటు స్థానిక సంస్థల మండలి స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి బికాంప్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికీ 11 గంటలకు పోలింగ్ ప్రక్రియ పుంజుకుంది. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు తర్వాత పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. అనేక పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేచి ఉండడంతో మరో గంట పాటు సమయాన్ని పొడిగించారు. కలెక్టరేట్‌లోఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం చోటుచేసుకోకుండా ఆయా నోడల్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలను జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఎన్నికలకు 74 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 27 పోలింగ్ కేంద్రాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆరు పోలింగ్ కేంద్రాలు, మొత్తం 107 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఎన్నికల నిర్వహణ విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరు ఎంతో కష్టపడి పనిచేశారన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ : పట్టభద్రులు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఓటర్లను కోరారు. పత్తికొండ పట్ట ణంలోని జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. అర్హులు ఓటు హక్కు విని యోగించు కునేలా పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలని అధికారులను కోరారు.

కోడుమూరు మండలంలో పోలింగ్ ప్రశాంతం

కోడుమూరు: కోడుమూరు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 94శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 124 ఓట్లకు గాను,117మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల పోలింగ్ కేంద్రంలో, 2 బూతులలో మొత్తం ఓట్లు,2,107 ఓట్లకు గాను, 1,515 ఓట్లు పోలయ్యాయి.72శాతం పోలింగ్ జరిగింది. పట్టభద్రులు ఉదయంనుంచే, మహిళ లతో సహా, పోలింగ్ కేంద్రానికి పొట్టేత్తారు.

పోలింగ్ అధికారులపై మండిపడ్డ పట్టుభద్రులు

తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్సీ ఓటింగులో సరైన వసతులు లేకపోవడంతో పోలింగ్ అధికారులపై పట్టుభద్రులు మండిపడ్డారు. 1350 మంది పట్టుభద్రులు ఓట్లకు ఒకే ఒక బూత్ ఏర్పాటు చేయడంతో రెండు గంటల పాటు క్యూ లైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.. కేవలం 27 ఓట్ల ఉన్నటీచర్లకు ఒక కౌంటర్ ఏర్పాటు చేశారు. 1350 మంది ఉన్న పట్టు భద్రులకు ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చంటి బిడ్డలతో వచ్చిన మహిళలు క్యూ లైన్ లో ఎక్కువసేపు ఉండాల్సి వచ్చింది.

కోడుమూరు మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

కర్నూలు హాస్పిటల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సి ఎన్నికలు పాణ్యం నియోజకవర్గంలో ప్రశాంతంగా నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల పాణ్యం ఓర్వకల్లు కల్లూరు అర్బన్ పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు పట్టభద్రులు ఉదయం 8 గంటలకే వారి వారి కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించు కునేందుకు బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో సాయ ంత్రం నాలుగు గంటల సమయం దాటినా కూడా కేంద్రం పరిధిలోకి వచ్చిన ఓటర్లకు ఓటు వేసే అవకా శాన్ని అధికారులు కల్పించారు. ఎన్నికల పోలింగ్ సరలిని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, టిడిపి నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, పిడిఎఫ్ నాయకులు పి నిర్మల, టి.రాముడు సాయిబాబా, పిఎస్.రాధాకృష్ణ, నరసింహులు పర్యవేక్షించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న టిజి.భరత్

చంటి బిడ్డతో ఓటు వేయడానికి వచ్చి న మహిళ

సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి లో పట్టుభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు చాలా ఇబ్బందులు గురియ్యారు. మండలంలోని 50 గ్రామాల నుండి వచ్చిన పట్టభద్రులు తమ ఓటు వినియోగించుకునేందుకు లైన్లో గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో మొత్తం 1350 ఓట్లు ఉన్నాయి. అయితే ఒకే పోలింగ్ బూత్ ఉండటంవల్ల ఓటు వేసే క్యూ లైన్ లో గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలతో వచ్చిన మహిళలు లైన్లో ఉండలేక చెట్ల కింద నిల్చున్నారు. మరి కొంతమంది ఓటు వేయకుండానే వెనక్కి వెళ్లారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం లక్షల రూపాయల ఖర్చు చేస్తున్నా అధికారులు మాత్రం ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా అధికారులు విఫలమయ్యాని పట్టు భద్రులు, ఉపాధ్యాయులు అంటున్నారు.స్కూల్ , టంగుటూరి ప్రకాశం పంతులు హై స్కూల్ (ప్రకాష్ నగర్)లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సందర్శించి ఎన్నికల భద్రతలను పరిశీలించారు. ఓటు వేసే క్యూలైనులు, పార్కింగ్ ప్రదేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తీరును జిల్లా ఎస్పీ సోమవారం పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం విధులు కొనసాగాలని , అక్కడ బందోబస్తు విధులలో ఉన్న పోలీసు అధికారులకు సూచించారు. ఎస్‌పి వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్‌పి యుగంధర్ బాబు, కర్నూల్ టూ టౌన్ సిఐ శ్రీనివాసులు ఉన్నారు.

సి బెళగల్ లో భారీగా తరలివచ్చిన ఓటర్లు

ప్రజాశక్తి- సి బెళగల్

ఎమ్మెల్సీ ఓటు వేయడానికి బెళగల్ హైస్కూల్ దగ్గరికి ఓటర్లు సోమవారం భారీగా తరలి వచ్చారు. పట్టభద్రులు 960 మంది ఉండగా మొత్తానికి 681 మంది సద్వినియోగం చేసుకొన్నారు. టీచర్స్ 16 మంది ఉండగా 14 మంది సద్వినియోగం చేసుకొన్నారు. ఇందులో వికలాంగులు 27 మంది పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకొన్నారు. మొత్తానికి 75.90 శాతం గా నమోదు అయ్యింది.

ఆరు టీచర్ ఓట్లు గల్లంతు - ఓటర్ల అయోమయం

సమాధానం ఇవ్వని అధికారులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ మండలం కొత్తకోట, సుంకేసుల, ముడుమాల, యనగండ్ల గ్రామాలకు చెందిన టీచర్లు ఓట్లు గల్లంతయ్యాయి. సోమవారం బెళగల్ హైస్కూల్ లో టీచర్ల ఓట్లు 22 కాగా 16 మాత్రమే అధికారుల ల అలసత్వపు వైఖరిగా కారణమని మీడియాలో అన్నారు.

ఎమ్మెల్యేకు చుక్కెదురు...

- గుర్తింపు కార్డు లేదని పోలింగ్ అధికారి అభ్యంతరం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి చుక్కెదురయింది. ఓటు వేసేందుకు వెళ్లిన ఆయనకు గుర్తింపు కార్డు లేదని పోలింగ్ అధికారి అభ్యంతరం చెప్పిన సంఘటన చోటుచేసుకుంది. సోమవారం ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఓటు వేసేందుకు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. గుర్తింపు కార్డు చూపాలని పోలింగ్ అధికారి అడిగారు. లేదని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. ఓటు వేసేందుకు పోలింగ్ అధికారి అనుమతించలేదు. ఏమీ చేయలేక గుర్తింపు కార్డు తెచ్చే వరకు పోలింగ్ కేంద్రం సమీపంలోని విజిటర్ రూములో అరగంట సేపు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆదోని మున్సిపాలిటీ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ప్రవేశించి బ్యాలెట్ పేపర్ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఓటరు స్లిప్పుతో పాటు ఒక గుర్తింపు కార్డు చూపించాలని పోలింగ్ అధికారి ఎమ్మెల్యేను కోరారు. తన వద్ద గుర్తింపు కార్డు లేదని ఎమ్మెల్యే పేర్కొనడంతో ఓటు వేసేందుకు అధికారి అనుమతించలేదు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కొంతసేపు పోలింగ్ కేంద్రంలోనే ఉండగా గుర్తింపు కార్డు తెచ్చేవరకు బయట వేచి ఉండాలని పోలింగ్ అధికారి కోరడంతో ఎమ్మెల్యే బయట వేచి ఉన్నారు. ఇంటికి వెళ్లి పార్టీ నాయకులు గుర్తింపు కార్డు తెచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చింది. అరగంట ఆలస్యంతో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- సొత్తు రికవరీ

ప్రజాశక్తి - కౌతాళం

నిందితులను చూపుతున్న పోలీసులు

మండలంలోని శ్రీఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సొమ్మును రికవరీ చేశారు. సోమవారం ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... కౌతాళంలోని ఎస్సీ కాలనీకి చెందిన బావిగడ్డ గోపి, కె.ఆనంద్ రాజు, రాజు, మరో ముగ్గురు కలిసి చోరీకి పాల్పడ్డారు. నిందితులు జల్సాలకు అలువాటు పడ్డారు. వారి తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపోక ఈనెల 12న తెల్లవారుజామున దేవస్థానంలో చోరీకి పాల్పడ్డారు. ముందుగా అందరూ దేవస్థానం దగ్గరకు వెళ్లారు. నలుగురు బయట కాపలా ఉండగా, బావిగడ్డ గోపి, ఒక వ్యక్తి గేటు దూకి దేవస్థానంలోకి ప్రవేశించారు. గర్భగుడి ముందు ఉన్న ఉచిత దర్శనం క్యూలైన్‌లో పెట్టిన స్టీల్ హుండీలో సుమారు రూ.లక్ష నగదు, కానుకలు దొంగలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కోసిగి సిఐ ఏరిషా వలీ ఆధ్వర్యంలో కౌతాలం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, సిబ్బంది హుస్సేన్ బాష, నరేంద్ర, వీరభాస్కర్, వీరేష్‌లు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం నిందితులను కౌతాళం గ్రామం శివారులో గల గాజుల చెరువు వద్ద అరెస్టు చేశారు. దొంగలించిన రూ.1,47,835ల నగదు, 56 తులాల వెండి, సుమారు 0.480 మిల్లీ గ్రాముల బంగారును రికవరీ చేశారు. కేసును త్వరగా ఛేదించిన కోసిగి సిఐని, కౌతాళం ఎస్ఐని, సిబ్బందిని డీఎస్పీ వినోద్ కుమార్ అభినందించారు.

రాజకీయ నాయకునిగా డబ్బులు సంపాదించే పరిస్థితి లేదు

- కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

'రాజకీయాల్లో డబ్బులు సంపాదించే పరిస్థితి లేదు. సేవా దృక్పథం, సేవా గుణం ఉన్న వారు మాత్రమే రాజకీయాల్లోకి రావాలి. ప్రస్తుతం ప్రజలు చైతన్య వంతులయ్యారు. ప్రభుత్వాలు కూడా డిజిటలైజ్ విధానం అమలు చేస్తున్నాయ'ని కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్సీ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీ సంజీవ్ కుమార్ ఓటు హక్కును ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. కౌన్సిలర్లు, జడ్‌పిటిసిలు ఎంపిటిసిల మాదిరిగా ఎంపీ కూడా క్యూ లైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బుల ప్రభావం ఎక్కువగా పని చేసిందని విలేకరులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా... అసలు అలాంటిదేమీ లేదని తెలిపారు. డబ్బులు ఇచ్చి ఓట్లు వేయించుకోవాల్సిన పరిస్థితి తమ ప్రభుత్వానికి, తమ పార్టీకి లేదని స్పష్టం

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్ కుమార్

చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి లేకుండా చేశారని, ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా లబ్ధి మాత్రం నేరుగా లబ్ధిదారులకే అందుతోందని చెప్పారు. పేదలకు గౌరవం పెరిగిందన్నారు. గతంలో మాదిరి రాజకీయాలు అనుకూలంగా లేవని, ఇప్పట్లో డబ్బులు సంపాదిస్తామని రాజకీయాల్లోకి వస్తే ఏమీ ఉండదని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంగా భారతదేశంలో అవినీతి పెరిగిపోయిందని కొందరు నాయకులు, అధికారులు దానికి అలవాటు పడిపోయారని చెప్పారు. దానిని రూపుమాపేందుకు ప్రభుత్వాలు అనేక కొత్త విధానాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ డిజిటలైజేషన్ యుగంలో అవినీతి ఉండదన్నారు. వంద శాతం ప్రజలకు ఎవరూ న్యాయం చేయలేరని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారని చెప్పారు. కొందరు అనవసరంగా విమర్శలు చేస్తున్నారని, అలాంటి వారి మాటలను నమ్మే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసలు డబ్బు ప్రవాహం లేదని, డబ్బులు పంచడానికి జగన్మోహన్‌రెడ్డి వ్యతిరేకమని చెప్పారు. ప్రజలకు ఏం చేయాలో చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని కులాల వారికి, అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో అవినీతి అలవాటుగా మారిందని, పాలలో నీళ్ల కలపనిదే ఉండడం లేదని తెలిపారు. ప్రజలు, అధికారులు, నాయకులు చైతన్యవంతులు కావాలని చెప్పారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ రఘునాథరెడ్డి ఉన్నారు.

గుండెపోటుతో వగరూరు మాజీ సర్పంచి రామిరెడ్డి మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని వగరూరు మాజీ సర్పంచి, రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి టిడిపి నాయకులు రామిరెడ్డి (46) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో గ్యాస్ సమస్యగా భావించి స్థానిక ఆర్ఎంపి వైద్యులకు చూపించారు. కొంత ఉప శమనం కలిగినా మళ్లీ నొప్పి రావడంతో ఎమ్మిగనూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. రామిరెడ్డికి భార్య రాగమ్మ, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. టిడిపి నాయకులుగా ఎంతో ఉత్సాహంగా సేవలు అందించిన రామిరెడ్డి మృతి చెందడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

రామిరెడ్డి మృతి టిడిపికి తీరని లోటు : తిక్కారెడ్డి

రామిరెడ్డి మృతి టిడిపికి తీరని లోటని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో మంచి సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన స్నేహశీలిగా, వివాదరహితునిగా మంచి పేరు ఉందని తెలిపారు. చిన్న వయస్సులోనే గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన భార్య రాగమ్మకు, పిల్లలకు ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, మాజీ ఎంపిటిసి అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రామిరెడ్డి అంత్యక్రియలు

- పాడె మోసి కడసారి వీడ్కోలు పలికిన తిక్కారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి

రామిరెడ్డి అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ముందుగా రామిరెడ్డి మృతదేహానికి పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డిలు పూలమాల వేసి, టిడిపి జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం రామిరెడ్డి తిక్కారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు రామిరెడ్డి పాడె మోసి కడసారి వీడ్కోలు పలికారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి

ఈరన్న, యల్లారెడ్డి, చావిడి వెంకటేష్, గోపాల్ రెడ్డి, మాధవరం అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, సూగూరు భాస్కర్ రెడ్డి, కురువ మల్లికార్జున, మాలపల్లి లక్ష్మన్న, చంద్ర, కేశన్న, జాలవాడి ముని, చిన్న భూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణారెడ్డి, జనార్దన్, లక్ష్మారి రామయ్య, నరసింహులు పాల్గొన్నారు.

పాడె మోస్తున్న తిక్కారెడ్డి

మంటలను ఆర్పుతున్న సిబ్బంది

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం

- రూ.2 లక్షల మేర నష్టం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎస్సీ కాలనీలో సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు రైతులకు సంబంధించిన నాలుగు గడ్డివాములు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక కాలనీవాసుల వివరాల మేరకు... హరిజన మనోహర్, హరిజన బాలుకు చెందిన పశు వులకు వేసే గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్‌ను తీసుకొచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. పేద రైతులకు సంబంధించిన వాములు కాలిపోవడంతో కాలనీవాసులు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని అధికారులను కోరారు.

గడ్డివామి దగ్ధం....

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని హులేబీడు గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు... రైతు ఆంజనేయకు సంబంధించిన పశువుల కోసం ఏర్పాటు చేసిన రూ.50 వేల విలువ గల గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. నష్టపోయిన రైతును ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు..

- సౌకర్యాల్లేక ఇబ్బందులు పడిన ఓటర్లు
- మందకొడిగా సాగిన పట్టభద్రుల పోలింగ్

ఆదోనిలో వివరాలు వెల్లడిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం జరిగిన పోలింగ్‌లో భాగంగా కొన్ని చెదురుముదురు సంఘటనలు తప్ప ఎమ్మెల్సీ స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్‌లో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. 259 మంది ప్రజాప్రతినిధులకు గాను 255 మంది ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, జడ్‌పిటిసిలు, ఎమ్మెల్యేలు, ఎంపీ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 98 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అలాగే ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ఆదోని నియోజకవర్గంలో 519 మంది ఓటర్లు ఉండగా 47 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్‌లో ఆదోని నియోజకవర్గంలోని ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 6,183 మంది ఓటర్లకు గాను 4,359 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 70.4 శాతం పోలింగ్ నమోదైంది. ఆదోనిలో జరిగిన పోలింగ్ సరళిని ఆదోని సబ్ కలెక్టర్, ఎన్నికల నోడల్ అధికారి అభిషేక్ కుమార్, ప్రత్యేక పరిశీలకులు, డిప్యూటీ కలెక్టర్ రమాకాంత్ రెడ్డి పరిశీలించారు. ఆదోనిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలోని రిసెప్షన్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు. అలాగే ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సిఐ శ్రీరామ్, టూ టౌన్ సిఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐలు భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారికి సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఉండడం వల్ల భీమా సర్కిల్ నుంచి పాత బస్టాండ్ వరకు ట్రాఫిక్ పెద్దఎత్తున స్తంభించింది. అలాగే కొన్ని కేంద్రాల వద్ద షామియాలను కూడా ఏర్పాటు చేయలేదని ఓటర్లు వాపోయారు.

పెద్దకడబూరు : స్థానిక, పట్టబద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సరళీ నిదానంగా సాగింది. దీంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొన్ని కేంద్రాల్లో పోలింగ్ నిదానంగా సాగడంతో పోలింగ్ సిబ్బందిపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు నిర్లక్ష్యంగా ఉందని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కావడంతో క్యూ లైన్‌లో నిల్చుకోలేక కొందరు ఓటర్లు అవస్థలు పడ్డారు. మరికొందరు క్యూ లైన్‌లో నిలబడలేక వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ ఎరీషావలీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఓటర్లకు తాగునీరు, మెడికల్ సౌకర్యం అందుబాటులో ఉంచామని చెప్పారు. దాదాపు నాలుగు గంటల వరకు ఓటర్లను అనుమతించారు. 4.30 గంటల నుంచి ఓటర్లను లోపలికి అనుమతించలేదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చిప్పగిరి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ చిప్పగిరిలో ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల ఓటర్లు 500 మందికి గాను 372 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.2 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 12మంది ఉండగా 11 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 91 శాతం నమోదయింది. ఎన్నికల సరళిని ఎన్నికల అధికారి శ్రీరాములు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ప్రత్యేకాధికారి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎన్నికల తనిఖీ అధికారి, పత్తికొండ ట్రెయినీ కలెక్టర్ వంశీకృష్ణ పరిశీలించారు. ఆలూరు సిఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. చిప్పగిరి ఎస్ఐ మల్లికార్జున, కానిస్టేబుళ్లు చంద్ర, రాజశేఖర్, యశ్వంత్, శంకర్‌తో పాటు రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన వైకుంఠం : చిప్పగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్నికల సరళిని టిడిపి ఆలూరు నియోజకవర్గం మాజీ ఇన్‌ఛార్జీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమన్నారు. టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి భీమా లింగప్ప చౌదరి, టిడిపి నాయకులు పెద్దన్న, కొండా రామాంజనేయులు, అమరేష్, గుర్రం అనిల్, రామదాసు, బర్మే గోపాల్ పాల్గొన్నారు.

హోళగుంద : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉపాధ్యాయ ఓటర్లు ఆరుగురు ఉండగా ఆరుగురూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం వందశాతంగా నమోదయింది. అలాగే పట్టభద్రుల ఓటర్లు 528 మంది ఉండగా, 431 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 82 శాతంగా నమోదయినట్లు ఎమ్మెల్సీ ఎన్నికల జోనల్ ఆఫీసర్ కోనేటి లక్ష్మీనారాయణ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని తహశీల్దార్ హుస్సేన్ సాబ్, ఎంపిడిఓ దాసు నాయక్ దగ్గరుండి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ అబ్దుల్ జహీర్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటింగ్ శాతంపై రాధాకృష్ణ ఆరా : ఎమ్మెల్సీ ఎన్నికలు ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతుందా లేదా అని, ఓటింగ్ శాతం ఎంత నమోదయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ ఆరా తీశారు. హోళగుందలో పర్యటించి మండల నాయకులతో మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా, ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకుంటున్నారా అడిగి తెలుసుకొని స్వయంగా పరిశీలించారు. ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. తమ విలువైన ఓటును న్యాయం కోసం పోరాడే సమర్థవంతుల కోసమే ఉపయోగించుకున్నామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు కబీర్ సాబ్, రామాంజనేయులు తెలిపారు.

దేవనకొండ : మండలంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ఆఫీసర్ హరీష్, తహశీల్దార్ సుదర్శనం ఆధ్వర్యంలో పట్టభద్రులు మొత్తం 1246 మందికి గాను, 891 మంది 71.60 శాతం, ఉపాధ్యాయ ఓటర్లు 46 మంది ఉండగా 42 మంది 91 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు బారులుదీరారు. పట్టభద్రులకు ఒకే పోలింగ్ కేంద్రం కేటాయించడంతో ఓటర్లు గంటల కొద్దీ లైన్‌లై నిలబడి అసహనానికి గురయ్యారు. సంబంధిత అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. పోలింగ్ కేంద్రాన్ని పత్తికొండ ఆర్‌డిఓ మోహన్ దాస్, డీఎస్పీ ఎ.శ్రీనివాస్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలూరు : మండలంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆలూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాయ్స్-2లో పోలింగ్ కేంద్రాల్లో జోనల్ ఆఫీసర్ సునీత, పోలింగ్ ఆఫీసర్ భీమేష్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రుల ఓటర్లు బారులు తీరి నిలబడ్డారు. 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రులు 1088 గాను 805, 73.9 శాతం, ఉపాధ్యాయులు 45 మందికి గాను 44 మంది, 97.7 శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ బాక్సులను జోనల్ అధికారి సునీత, తహశీల్దార్ మల్లికార్జున, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, సిఐ ఈశ్వరయ్య, ఆర్ఐ బసన్నగౌడ్, ఎస్ఐలు నాయక్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పత్తికొండ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూముకు తరలించారు.

కోసిగిలో ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ బిటి.నాయుడు

కోసిగి రూరల్ : కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తహశీల్దార్ రుద్ర గౌడ్, పిఒ గురు ప్రసాద్, వీర రాజు, అధికారుల పర్యవేక్షణలో పకడ్బందీగా పోలింగ్ జరిగింది. మండలంలో 807 మంది పట్టభద్రులకు గాను 724 మంది, 25 మంది ఉపాధ్యాయులకు గాను 24 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. చివరి క్షణంలో అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ మద్దతుదారులు, టిడిపి ఎమ్మెల్సీ మద్దతుదారులు అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణకు దారితీసింది. పోలీసుల రంగ ప్రవేశంతో వ్యవహారం సద్దుమణిగింది. చెదురుముదురు ఘటనలతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ ఎరీషావలీ, ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిం చారు. రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ బసవరాజు, ఆర్ఐ శ్రీరాములు, విఆర్ఒలు బసవరాజు, రామాంజనేయులు, బాలస్వామి, వీరేష్, లింగన్న పాల్గొన్నారు.

మంత్రాలయం : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మంత్రాలయంలో ప్రశాంతంగా ముగిసింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని 253 పోలింగ్ కేంద్రంలో 643 మంది పట్టభద్రుల ఓటర్ల ఉండగా 531 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రం 130లో 26 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 23 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 97 శాతం పోలింగ్ నమోదైంది. జోనల్ ఆఫీసర్ శ్రీనివాసులు, పోలింగ్ ఆఫీసర్లు హనుమంతరావు, వరప్రసాద్, తహశీల్దార్ చంద్రశేఖర్, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రదీప్ రెడ్డి : వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు, సింగిల్ విండో అధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి పట్టభద్రులుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ బూత్ 253లో సతీ సమేతంగా వచ్చి ఇద్దరూ ఓటు వేశారు.

ఆస్పరి మండలంలో పోలింగ్ సమయం ముగిసి సాయంత్రం 6 గంటలు దాటినా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి 49 మంది అభ్యర్థులు బరిలో నిలువగా ఒక్కో ఓటరు ఓటు వేసేందుకు 5 నిమిషాలకుపైగా సమయం పట్టింది. ఒక ఓటు వేయడానికి 5 నిమిషాలు పట్టడంతో క్యూలైన్లలో నిలిచిన ఓటర్లు ఓటు వేసేందుకు గంటల కొద్ది చూడాల్సి వచ్చింది. ఉదయం 10 గంటల వరకు మందకొడిగా సాగిన ఓటింగ్ వేగంగా పుంజుకుంది. 11 గంటలకు ఓటర్లు గంటకు పైగానే క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. 11 గంటలకు గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు రావడంతో క్యూలైన్ పెరిగింది. సాయంత్రం 5.30 గంటలకు పైగానే పోలింగ్ ప్రక్రియ సాగింది. అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ఎంతో సౌలభ్యంగా ఉండేదని ఓటర్లు అభిప్రాయపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోనెగండ్ల : గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 1,516 పట్టభద్రుల ఓట్లకు గాను 1,228 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 81 శాతం పోలింగ్ నమోదయింది. అలాగే 46 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 43 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 93 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు, ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ బ్యాలెట్ పేపరు పెద్దగా ఉండడం, ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ మందికి ప్రాధాన్యత ఇవ్వడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. 1 గంట వరకు 40 శాతం పోలింగ్ జరగగా, క్రమంగా పుంజుకుంటూ ఎన్నికల సమయం ముగిసేలోపు 81 శాతానికి చేరింది. పోలింగ్ కేంద్రం వద్ద పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కొన్ని కేంద్రాల వద్ద ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాచాని గర్ల్స్ హై స్కూల్‌లో నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తి వాహనాన్ని పోలీసులు అనుమతించకపోవడంతో అతను ద్విచక్ర వాహనంపై కూర్చొని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ వీల్ చైర్ లేకపోవడంతో ఇతర ఓటర్ల సహాయంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇదే పోలింగ్ కేంద్రంలో పోలీసులు 200 మీటర్ల పైనే వాహనాలను నిలిపివేయడంతో పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి పిల్లలు ఉన్నవారు ఎండలో ఇబ్బందులు పడ్డారు. మాచాని గర్ల్స్ హై స్కూల్ దగ్గర విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి ఓటర్లు, విలేకరులతో దురుసుగా ప్రవర్తించారు. ఈసీ జారీ చేసిన పాస్ చూపించినా 'నాకు తెలియదు. మీరు ఇక్కడ ఉండకూడదు. వెళ్లండి' అంటూ హుకుం జారీ చేశారు. ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రమాకాంతరెడ్డి, తహశీల్దార్ జయన్న, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. 3.30 గంటల సమయం దాటిన తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన వారికి సమయం దాటిన తర్వాత కూడా సీరియల్ సంఖ్యను ఇచ్చి ఓట్లు వేయించారు. 4 గంటల తర్వాత వచ్చిన వారికి ఓటుకు అనుమతించలేదు.

హోళగుందలో ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న అధికారులు

ఆలూరులో అధికారులను అడిగి తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ

పెద్దకడబూరు క్యూలైన్‌లో నిలిచి ఉన్న ఓటర్లు

చిప్పగిరిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వైకుంఠం

ఆస్పరిలో క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లు

మంత్రాలయంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రదీప్‌రెడ్డి

నేటి నుంచి గెద్దరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవనకొండ మండలం గెద్దరాళ్ల గ్రామంలో కొలువైన శ్రీమారెమ్మ దేవర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. 14న అమ్మ వారి విగ్రహాల ఊరేగింపు స్వామి, కల్యాణోత్సవం, పురాతన ఆభరణాల అలంకరణ, పాత కల్యాణం, మహా మంగళహారతి ఉంటుందని తెలిపారు. అర్ధరాత్రి ఆయకట్టు దారుల గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15న తెల్లవారుజామున బలిహరణ ఉత్సవం,

సాయంత్రం పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 16న పల్లెదొడ్డి గ్రామం నుంచి గద్దెరాళ్ల మారమ్మ ఆలయం వరకు మహా మంగళహారతి ఉత్సవం జరగనున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు.

భారీ పోలీసు బందోబస్తు : దేవర ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ భూపాలుడు తెలిపారు. పత్తికొండ డీఎస్పీ ఆధ్వర్యంలో నలుగురు సిఐలు, 8 మంది ఎస్ఐలు, 140 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నంద్యాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి

పోలింగ్ ప్రశాంతం

- పట్టభద్రులు 77 శాతం, ఉపాధ్యాయులు 94 శాతం నమోదు
- ఆత్మకూరులో స్వల్ప ఉద్రిక్తత
- పగిడ్యాలలో దొంగ ఓటు వేసేందుకు యత్నం

నంద్యాలలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఆత్మకూరులో స్వల్ప ఉద్రిక్తత మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పగిడ్యాలలో దొంగ ఓటు వేసేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో సోమవారం నిర్వహించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం తరువాత కాస్త ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల కోసం 61 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 30 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. 54,929 మంది పట్టభద్రుల్లో 42,310 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 30,241 మంది పురుషులు, 12,068 మంది స్త్రీలు, ఒకరు ఇతరులు ఓటు వేశారు. 77.03 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 4,426 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,631 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,631 మంది పురుషులు, 1,530 మంది స్త్రీలు ఓటు వేశారు. 94.01 శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రుల ఓటింగ్ కోసం సాయంత్రం పోటెత్తడంతో 4 గంటలకు క్యూలైన్‌లో ఉన్న వారికి టోకన్లను పంపిణీ చేసి పోలింగ్‌ను కొనసాగించారు.

ఆత్మకూరులో స్వల్పఉద్రిక్తత

ఆత్మకూరులో పట్టభద్రుల పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రంలోకి వైసిపి నాయకులు యథేచ్ఛగా తిరుగుతున్నారని టిడిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లోపల ఉన్న వైసిపి నాయకులందరినీ బయటకు పంపించేశారు.

పోలింగ్ సరళి పరిశీలన : కర్నూలు కంట్రోల్ రూం నుంచి స్థానిక సంస్థల పోలింగ్ సరళిని ఎన్నికల పరిశీలకు ఎంఎం నాయక్ పరిశీలించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆరు ఆర్డీవో కార్యాలయాల్లో జరుగుతున్న పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ అంశంపై కలెక్టర్, జెసిని అడిగి తెలుసుకున్నారు. నంద్యాల కంట్రోల్ రూము నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జెసి నిశాంతి, డిఆర్ఒ పుల్లయ్య పర్యవేక్షించారు.

స్థానిక సంస్థ స్థానానికి 96.43 శాతం..

ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లాలోని నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. నంద్యాల జిల్లాలో 578 మంది ప్రజాప్రతినిధులకు గాను 557 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.37 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల డివిజన్ బ్యాలెట్ బాక్సులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఆత్మకూరు డివిజన్ బాక్సులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, డోన్ డివిజన్ బాక్సులను సుధా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించారు.

శిరివెళ్లలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్ర ఓటర్లు

దొంగ ఓటు వేసేందుకు యత్నం

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

దొంగ ఓటు వేసేందుకు వచ్చిన బాలకృష్ణ

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో దొంగ ఓటు వేసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. పగిడ్యాల జడ్పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 306 పోలింగ్ కేంద్రంలో పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలకృష్ణ దొంగ ఓటు వేసేందుకు వచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన ఏజెంట్ వెంటనే పిఒ దృష్టికి తీసుకెళ్లారు. అయితే బాలకృష్ణ తన తమ్ముడి ఓటు వేసేందుకు వచ్చానని చెప్పాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నందికొట్కూరు రూరల్ సిఐ సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు బాలకృష్ణను అదుపులోకి తీసుకుని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో సోమవారం జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలో ఎస్‌పి పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూలైనులు, పార్కింగ్ ప్రదేశాలు, ఎన్నికలు జరుగు తీరును, భద్రత చర్యలను పర్యవేక్షించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు నియమ నిబంధనల ప్రకారం విధులు కొనసాగాలని, ఓటర్లు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలలో అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల సిబ్బంది పోలైన బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్ వద్దకు బస్సులలో తరలింపు సమయంలో రూట్ మొబైల్ పార్టీ సిబ్బంది ఆయా బస్సులకు రక్షణగా ఉంటూ సురక్షితంగా చేర్చాలని తెలియజేశారు. జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, 30 ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు, 3 స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి సంఘటనలు జరగలేదని, ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఈ పోలింగ్‌కు పోలీసు డిపార్ట్మెంట్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతిభద్రతలను సంరక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు కొనసాగాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి, నంద్యాల స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు, సిఐ పులిశేఖర్, ఆళ్లగడ్డ పట్టణ సిఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్సైలు తిమ్మయ్య, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు. అలాగే దొర్నిపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ రఘువీర్ రెడ్డి పరిశీలించారు. పోలీసులు తమకు నిర్దేశించిన బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. **బేతంచెర్ల :** మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి రఘువీర్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పర్యవేక్షణ అధికారి తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రియతమ్ రెడ్డి, ఎస్సై శివ శంకర్ నాయక్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 320 పోలింగ్ కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు ఓటును వినియోగించుకున్నారు. టీచర్స్ 97 శాతం, పట్టభద్రులు 83 శాతం పోలింగ్ నమోదు అయ్యినట్లు తెలిపారు.

ఆళ్లగడ్డలో పర్యటిస్తున్న ఎస్‌పి

ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానంలోని అన్న ప్రసాద వితరణ విభాగంలో పొరుగు సేవల విధానంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన బి.రామాంజనేయులు కుటుంబానికి ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది వారి ఒక్క రోజు వేతనాన్ని ఇఒ లవన్న చేతుల మీదుగా సోమవారం అందజేశారు. బి.రామాంజనేయులు గతేడాది డిసెంబర్ 19న అనారోగ్యంతో మృతి చెందారు. రామాంజనేయులు కుటుంబానికి ఆర్థిక సహాయంగా శ్రీశైల దేవస్థానంలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవలందిస్తున్న సిబ్బంది నెలవారి జీతం నుండి ఒక్కరోజు వేతనాన్ని మొత్తం 2 లక్షల 73 వేల 128 రూపాయలను డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ఆయన భార్య బి.లావణ్యకు ఇఒ చేతుల మీదుగా అందజేశారు.

ఇఒ చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని నియోజకవర్గ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలతో కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరి సురేష్ కుమార్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని సంస్కృతంలో రాస్తే కవయిత్రి మొల్లమాంబ తెలుగులో రాశారన్నారు. మొల్ల కుమ్మర ఆడపడచు కావడం ఘర్వకారణమన్నారు. అంతటి గొప్ప కవయిత్రిని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించేలా నిర్ణయించడం జీవో ఇవ్వడం రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కుమ్మర ప్రజల్లో ఆనోందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు శివరాం, నాగరాజు, పాతపాడు మహేష్, సుబ్బయ్య, శివరామ కిట్టు, రాజేశ్వరి, లక్ష్మీప్రసన్న, శ్రీలక్ష్మి, నాగమయ్య, రవి, రామ సుబ్బయ్య, నరేంద్ర, తమ్మరాజు, తిమ్మయ్య, సాయి, మహేంద్ర, కష్ణ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల కోసం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి భక్తులు 1 లక్ష 51 వేల 116 రూపాయలు విరాళంగా సోమవారం అందజేశారు. ప్రకాశం జిల్లా కనిగిరి గ్రామానికి చెందిన జిల్లెళ్ళ లక్ష్మి నారాయణ రెడ్డి దంపతులు, జిల్లెళ్ళ విజయభాస్కర్ రెడ్డిలు ముందుగా కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నరు. అనంతరం వారు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డికి విరాళాన్ని అందజేశారు. దాతలను ఈవో శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపికను, తీర్థప్రసాదాలు అందజేశారు.

దాతలను సత్కరిస్తున్న ఇఒ

నూనె గింజల సాగుపై దృష్టి సారించాలి

- ఐఐఓఆర్ సీనియర్ సైంటిస్ట్ అండ్ సీడ్ సెక్షన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.జవహర్ లాల్

ప్రజాశక్తి - బనగానపల్లె

నూనె గింజల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఐఐఒఆర్ సీనియర్ సైంటిస్ట్ అండ్ సీడ్ సెక్షన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె .జవహర్ లాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌ఈ అండ్ సిఎస్ కార్యదర్శి పి. బాలాజీ అధ్యక్షతన ఆముదం పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.జవహర్ లాల్ మాట్లాడుతూ ఆముదం, కుసుమలు, ప్రొద్దుతిరుగుడు, తెల్ల కుసుమలు తదితర రకాల నూనె గింజల పంటలపై ఐఐఓఆర్ చేస్తున్న పరిశోధనల గురించి వివరించారు. ప్లాంట్ బ్రీడర్ క్యాస్టర్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ ఆముదం పంట విత్తన ఉత్పత్తికి సంబంధించిన శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆముదం సాధారణంగా పండిచడం కంటే విత్తనోత్పత్తి ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సంఘాలుగా ఏర్పడి విత్తనోత్పత్తి చేపట్టాలని సూచించారు. అధిక దిగుబడుల సాధనకు చేయాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల ఉత్పత్తిపై పోషక లోపాల ప్రభావం, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. రసాయన, ఇతర క్రిమిసంహార మందుల వాడకం తగ్గించి, నేరుగా పురుగు లేదా తెగులుకు సంబందించిన ఒక రకమైన మందునే పిచికారీ చేసి ఖర్చు తగ్గించుకోవాలని తెలిపారు. ఎండు తెగులు, వేరుకుళ్ళు , పొగాకు లద్దె పురుగు, నామాల పురుగు నివారణపై సస్య రక్షణ చర్యలు సూచించారు. కొత్త వంగడాలను వినియోగించి అధిక దిగుబడులు పొందాలని తెలియచేసారు. కార్యక్రమంలో అగ్రోనామిస్ట్ డాక్టర్ సురేష్, ప్లాంట్ బ్రీడర్ అండ్ సీనియర్ సైంటిస్ట్ మంజునాథ్, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌డి ప్రసాద్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి, శాస్త్రవేత్త సుధాకర్, ఎస్‌హెచ్‌ఈ అండ్ సిఎస్ ఏవో సురేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, రమణయ్య, బాలరాజు, ఆది నారాయణ, రవిగౌడ్, లక్ష్మి ప్రియా, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐఐఓఆర్ సీనియర్ సైంటిస్ట్ అండ్ సీడ్ సెక్షన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.జవహర్ లాల్

పోలింగ్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట టిడిపి నాయకులు మంచాల భాస్కర్ రెడ్డి, మహబూబ్ వలి, ఖలీల్, వినయ్, విశ్వం, చందు, అవినాష్, వెంకటేశ్వర్లు, పాణ్యం భాస్కర్ రెడ్డి, దూదేకుల దస్తగిరి, జెపి తిమ్మయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న భూమా

రైతు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన యువ రైతు మధు ప్రతాప్ కుటుంబాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సోమవారం పరామర్శించారు. అప్పుల బాధ తాళలేక గతవారం యువ రైతు మధు ప్రతాప్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తనకున్న కొద్దిపాటి పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ జీవించేవారమని, వ్యవసాయంలో పెట్టుబడుల కోసం చేసిన అప్పులు అధికమై, పంట దిగుబడి లేక నష్టం రావడంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడి దూరమయ్యారని బాధితులు బోరున విలపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ సభ్యులను ఆదుకుంటామని వారికి భరోసా కల్పించి ఓదార్చారు. కార్యక్రమంలో మహదేవపురం గ్రామపంచాయతీ సర్పంచి పెద్ది రమణయ్య, మాజీ ఆలయ చైర్మన్ కొట్టే జయ లక్ష్మమ్మ, వెంకట స్వామి, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ రామిరెడ్డి

పేదింటి అమ్మాయిల వివాహాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంట్ల పట్టణంలోని స్వామి నగర్ కాలనీకి చెందిన పేదింటి అమ్మాయిల వివాహాలకు వైసిపి డాక్టర్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ రామిరెడ్డి సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ రామిరెడ్డి సోమవారం ఆర్థికసాయం అందజేవారు. స్వామినగర్ కాలనీకి చెందిన కోనాపురం మద్దమ్మ, మారెన్నల కుమార్తె మంజుల, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిల కుమార్తె సంపూర్ణల వివాహాలకు డాక్టర్ రామిరెడ్డి ఒక్కొక్కరికి 5 వేల రూపాయలు చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్య, వైద్యం, వివాహాలకు తనవంతుగా ఎల్లపుడు ముందుంటానని చెప్పారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఆర్థిక సహాయ కార్యక్రమాలు అందించడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బందెల ఓబులేసు, వార్డు మెంబర్ రఘు, అమడాల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు మోడల్ విద్యార్థులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోనిమోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మి సోమవారం తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ డోన్‌లో జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించగా ఆరవ తరగతి విద్యార్థి బాలాజీ నాయక్, ఏడవ తరగతి విద్యార్థులు సాయిరాం నాయక్, మహేంద్రలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మోడల్ విద్యార్థులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రభుత్వ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల

ప్రభుత్వ పథకాలే వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను వైసీపీ నాయకులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ వారు ఓటమి భయంతోనే వైసిపి వారిపై దొంగ ఓట్లు ఎక్కించుకున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్.బి.చంద్రశేఖర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ పుల్లయ్య, బొల్లవరం భూపాల్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టిడిపిదే విజయం

- మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ చెందిన అభ్యర్థులు విజయం సాధిస్తారని పాణ్యం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన గడివేములలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను జరిగే తీరుపై టిడిపి నాయకులు ద్వారా ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గౌరు సరితా రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వంపై అసంతృప్తి ఉండడంతో ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీ చెందిన అభ్యర్థులకు ఓటు వేశారని అన్నారు. వైసిపి నాయకులు ఓటమి భయంతోనే దొంగ సర్టిఫికెట్తో దొంగ ఓట్లు ఎక్కించి వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశాడని ఇప్పుడు నిరుద్యోగులు ఓట్లతో సమాధానం చెప్తారని అన్నారు. ఉపాధ్యాయులకు సరైన సమయానికి జీతం రాక ఇబ్బంది పడుతున్నారు. వీరి దృష్టిలో ఉంచుకొని ఓటుతోనే సమాధానం చెప్తారని అన్నారు. మండల టిడిపి నాయకులు దేశం సత్యనారాయణ రెడ్డి, మాజీ మండలా ధ్యక్షులు వంగాల శ్రీని వాస్ రెడ్డి, గడిగా రేవుల శ్రీనివాసులు, ఉండుట్ల గణేష్ రెడ్డి, వెంక టేశ్వర్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మీ దేవి, ఐటిడిపి నాయకులు రాజు, మత్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

ప్రశాంతంగా 'స్థానిక' పోలింగ్

స్ట్రక్చర్‌పైనే ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీటీసీ కనకమ్మ

ప్రజాశక్తి - ఆత్మకూర్

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు మొత్తం ఓటర్లు 165 మంది ఉండగా ఇందులో 164 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కంచర్ల కనకమ్మ తన కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండడంతో ప్రత్యేక వాహనంలో ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఎన్నికల పోలింగ్ కేంద్రానికి బంధువులు తీసుకొచ్చారు. సహాయకులతో ఆమెకు ఓటు హక్కు కల్పించాలని ఆమె బంధువులు కోరినప్పటికీ ఆర్డిఓ అందుకు సమర్థించలేదు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తన ఓటు హక్కును వినియోగిం చుకునేందుకు అక్కడికి వచ్చిన సందర్భంగా కనకమ్మ బంధువులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. దీంతో అధికారులతో స్పందించి చర్చించి స్ట్రక్చర్ పైనే ఆమెను పోలింగ్ హాల్లోకి తీసుకొని వెళ్లి ఓటు వేసే విధంగా చర్య చేపట్టారు. అదే విధంగా ఎమ్మెల్యే వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ తను ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీశైలం నియోజవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియాతోపాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు ఆర్డీవో కార్యాలయంలోని ఎన్నికల కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎన్నికల కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఎన్నికల సరళిని పర్యవేక్షించారు. అనంతరం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వెలుగోడులో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. మాజీ నాయ శాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా స్థానిక డిఎస్పి శృతి, రామాంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

స్ట్రక్చర్‌పైనే ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంపీటీసీ కనకమ్మ

ఎన్నికల సరళని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 17 మంది గైర్హాజరు

డోన్: పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో నిర్వహిం చిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 171 మంది ప్రజాప్రతినిధులకు గాను 154 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 17 మంది గైహాజరయ్యారు.

పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టిడిపి నాయకులు

పోలీసులు, టిడిపి నేతలకు మధ్య వాగ్వివాదం

- పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నందు టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మండ్రా శివానందరెడ్డి రాకతో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. సదరు టిడిపి నేత మాండ్ర శివానందరెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రమునకు వెళ్లేక్రమంలో ఆయన వెంట వస్తున్న అనుచరులను పట్టణ ఎస్సై రమణ నిలుపుదల చేసి, టిడిపి శివానందరెడ్డి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, కౌన్సిలర్ నాయబ్, కౌన్సిలర్ జనార్ధన్ గౌడ్, ఉపసర్పంచ్ సురేష్ ఎలా వెళ్తారు? అంటూ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడే విధి నిర్వహిస్తున్న ఎస్సై ఎన్వి రమణ తన చాకచక్యంతో ఆందోళన చేస్తున్న వారిని దీనితో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రమణ, సీఐ విజయభాస్కర్ పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా తగిన చర్యలు చేపట్టారు.

గడ్డి వాములు దగ్ధం

- రూ.లక్ష ఆస్తి నష్టం

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని మద్దూరు మజార గ్రామం కృష్ణానగర్ గ్రామంలో రైతు ఎస్ షబ్బీర్‌ చెందిన రెండు గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఆత్మకూరు ఫైర్ స్టేషన్ కు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. సుమారు రైతుకు లక్ష రూపాయలు నష్టం వాటిలినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఒక ఎద్దు, ఒక ఆవులకు గాయాలు అయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వలన జరిగి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. ఫైర్ సిబ్బంది ఎస్ఎఫ్ఓ భీముడు నాయక్, ఎల్ ఎఫ్ కరిముల్లా, డ్రైవర్ ఎస్ఎండీ గౌస్, ఫైర్‌మెన్లు శ్రీనివాసులు, ఇమామ్ ఖాసిం, ఎస్ వి నరసింహ స్వామి పాల్గొన్నారు.

గడ్డి వాములను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నిరసనల మధ్య పోలింగ్

- తాగునీటి వసతి కల్పించకపోవడంపై ఓటర్లు అసహనం

- గంటల తరబడి క్యూ లైన్‌లోనే..

పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేయడానికి క్యూలైన్లో వేచి ఉన్న ఓటర్లు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండల కేంద్రంలోని బండి ఆత్మకూరులో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల నిరసనల మధ్య పోలింగ్ సాగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రారంభం కాగా మండలంలోని పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేం దుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు. మండలంలో 1306 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా బండాపూర్‌లో కేవలం ఒక పోలింగ్ కేంద్రం మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుమారు మూడు గంటల నుంచి నాలుగు గంటల సమయం పట్టడంతో ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రం వద్ద తాగునీటి సదుపాయం కల్పించకపోవడంతో పట్టభద్రుల ఓటర్లు ఏకంగా క్యూలైన్లో నిలబడి నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఓటర్ల నిరసన తర్వాత అధికారులు ఓటర్లకు తాగునీటి సదుపాయం కల్పించారు. ఓటు వేసేందుకు గంటల తరబడి క్యూ లైన్‌లో వేచి ఉండాల్సి రావడంతో అనారోగ్యానికి గురైన వారు,మహిళలు, చంటి బిడ్డలతో పోలింగ్ కేంద్రానికి వచ్చి మహిళలు అవస్థలు పడ్డారు. దీంతో రెండవ పోలింగ్ కేంద్రం కూడా ఏర్పాటు చేసి ఉంటే ఇంత సమయం పట్టేది కాదు కదా అని అధికారులను ఓటర్లు ప్రశ్నించారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌లో 82.46 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 97 శాతం గా పోలింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారి రాజశేఖర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలను శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిలు వేర్వేరుగా సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షణలో ఎస్సై బాబు పటిష్ట చర్యలు చేపట్టారు.

సత్యం రెడ్డిని పరామర్శిస్తున్న మాండ్ర

టిడిపి నేతకు మాండ్ర పరామర్శ

ప్రజాశక్తి - పగిడ్యాల

అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకుడు పుల్యాల సత్యం రెడ్డిని టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానంద రెడ్డి సోమవారం పరామర్శించారు. పగిడ్యాల గ్రామానికి చెందిన పుల్యాల సత్యంరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. విష యం తెలుసుకున్న మాండ్ర శివానంద రెడ్డి సత్యం రెడ్డి నివాసానికి వెళ్లి ఆరోగ్యం పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజశేఖర్ రెడ్డి, సిరి గౌడ్, మహేష్ నాయుడు, జయ సూర్య, పగడం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు

- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లెలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలలో, కస్బా ప్రాథమిక పాఠశాలలో ఒక పట్టభద్ర, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరిగాయి. కస్బా ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో 350 పోలింగ్ బూత్‌లో 778 ఓట్ల గాను 614 ఓట్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 351 పోలింగ్ కేంద్రంలో 686 ఓట్లకు 550, 351-ఎలో 611 ఓట్లు, 352లో 738 ఓట్లకు 621 ఓట్లు పోల్ అయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 443 ఓట్లకు 433 ఓట్లు పోలైనట్లు తహశీల్దారు శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ పుష్పకుమారి తెలిపారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా దిశ డిఎస్పి మురళి రావు, సిఐ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో ఎస్సై రామిరెడ్డి పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. మండలంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీగా పోలింగ్ శాతం నమోదయింది. **నంద్యాల అర్బన్ :** నంద్యాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే సోదరి శిల్పా, సతీమణి 36వ వార్డ్ కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి క్యూలైన్‌లో వెళ్లి ఓటు వేశారు. అలాగే ఆర్డిఓ కార్యాలయంలో ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, జడ్పిటిసి, ఎంపిపి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, ఎంపిటిసిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. **రుద్రవరం :** మండల కేంద్రం రుద్రవరంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా సోమవారం జరిగాయి. స్థానిక కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు బూతులు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 39 ఉండగా 36 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 789 ఓటర్లు ఉండగా 602 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై నిరంజన్ రెడ్డి ఉన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా 144 సెక్షన్‌తోపాటు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. **ప్యాపిలి :** ప్యాపిలి పట్టణంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయి.ఉదయం ఎనిమిది గంటల నుండి తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు బారులు తీరారు. సిఐ శ్రీరాములు, ఎస్ఐ సిఎం రాకేష్‌లు పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్యాపిలిలో తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, డిటి మారుతి, జలదుర్గం పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. పోలింగ్ అనంతరం తహసిల్దార్ చంద్రశేఖర్ వర్మ మాట్లాడుతూ ప్యాపిలిలో 83.17 శాతం, జలదుర్గం 83.17 శాతం నమోదయిందని తెలిపారు. ఉపాధ్యాయులు 25కు 25 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారని తెలిపారు. **అవుకు :** అవుకు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ అధికారులు పోలింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 1097 పట్టభద్రులు ఉండగా 859 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.ఉపాధ్యాయులకు సంబంధించి 54 ఓట్లు ఉండగా 54 ఓట్లు పోలయ్యి 100 శాతం పూర్తయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సిబ్బందితో పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. **సంజామల :** సంజామల మండల కేంద్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు తహశీల్దార్ మల్లికార్జున రావు తెలిపారు. పట్టభద్రులకు 1022 ఓట్లకు గాను 826 ఓటు పోలయ్యాయని, ఉపాధ్యాయులు 47 ఓట్లకు గాను 44 పోలైనట్లు చెప్పారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు. **మహానంది :** మహానంది మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ శాతం 82.03,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ శాతం 97 నమోదైనట్లుగా అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నంద్యాల రూరల్ సీఐ రవీంద్ర, మహానంది ఎస్ఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మహానంది తహశీల్దార్ జనార్ధన్ శెట్టి మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు చాలా ఆసక్తిగా ఎన్నికల్లో పాల్గొన్నారని తెలిపారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో టిడిపి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామ లింగారెడ్డి, వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డిలు పరిశీలించారు. **ఉయ్యాలవాడ :** మండలంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని తహశీల్దార్ రవికుమార్ తెలిపారు. మండలంలో 690 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా 524 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. 21 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 20 మంది ఓటు వేశారని తహశీల్దార్ తెలిపారు. ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. **శిరివెళ్ల :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రం శిరివెళ్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన పోలింగ్‌ను డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐ చంద్ర బాబు నాయుడు, ఎస్సై శరత్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ షేక్ మొహిద్దిన్, ఇతర అధికారులు పర్యవేక్షించారు. పట్టభద్రులు 1313 మందికి గాను 952 మంది, 69 మంది ఉపాధ్యాయులకు గాను 65 మంది ఓటు హక్కును వినియోగించుకు న్నారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ మండలంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టబద్రులు మొత్తం 2692 ఓట్లుండగా 2073 పోలయ్యాయి. పోలింగ్ శాతం 76.83గా నమోదు అయింది. ఉపాధ్యాయ సంబంధించి 246 ఓట్లకు గాను 237 పోలయ్యాయి. పోలింగ్ శాతం 96.34గా నమోదయింది. 325 నెంబరు పోలింగ్ కేంద్రంలో ఏజెంట్ల వివరాల నమోదులో జాప్యం కారణంగా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎస్పీ రఘువీర్ రెడ్డితో వచ్చిన పోలీసు అధికారులు, సచివాలయ మహిళా పోలీసులు బూత్‌ల వద్ద బందోబస్తు నిర్వహిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేసి వారిని పంపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చక్రాల కుర్చీలు లేకపోవడంతో వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. అలాగే షామియానాలు కూడా లేకపోవడంతో ఓటర్లు ఎండలో ఇబ్బంది పడ్డారు. డిఎస్పి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సిఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్సైలు తిమ్మయ్య, వెంకటరెడ్డిలు తమ సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. దొర్నిపాడులో తహశీల్దార్ జయప్రసాద్ మాట్లాడుతూ 530 పట్టభద్రుల ఓట్లకు గాను 456 మంది, 18 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 18 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. **గోస్పాడు :** గోస్పాడు మండల కేంద్రంలో ఉపాధ్యాయులు 98 శాతం, పట్టభద్రులు 90 శాతం పోలింగ్ నమోదయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. **ఆత్మకూరు :** పట్టణంలో పట్టభద్రుల, టీచర్స్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీల ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 2939 మంది ఉండగా ఇందులో 2253 పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సంబంధించి 210 మంది ఓటర్లు ఉండగా ఇందులో 203 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు శ్రీశైల మండలం సున్నిపెంటలోని ప్రభుత్వ ప్రాజెక్టు పాఠశాల నందు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు మందకొడిగా సాగిన 10 గంటల తర్వాత పట్టభద్రుల ఓటర్లు వరుసలో బారులు తీరి వారి ఓటును వినియోగించుకున్నారు. శ్రీశైలం మండలంలోని సుండిపెంట, లింగాల గట్టు, శ్రీశైలం లో పట్టభద్రులు 890 ఓట్లు,ఉపాధ్యాయులు 35 ఓట్లు నమోదు అయినట్లు తాసిల్దార్ బి. రాజేంద్ర సింగ్ వివరించారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టభద్రులు 652 ఓట్లు నమోదు కాగా 73.26 శాతం నమోదయింది. అలాగే టీచర్స్ ఓట్లు 35 ఓట్లు ఉండగా అందులో 31 మంది ఓట్లు వేయడంతో 88.57 శాతం నమోదయింది. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ గంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపట్టారు. **చాగలమర్రి :** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రుల పోలింగ్‌కు ఓటర్లు ఉదయం నుండే బారులు తీరారు. ఎన్నికల అధికారులు తహసీల్దారు విజయ్ కుమార్,ఎంపిడీఓ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి 113 మంది ఓటర్లకు 112 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి 1491 మంది పట్టభద్రులకు గాను 1146 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వారు వివరించారు. పట్టభద్రుల పోలింగ్‌కు సంబంధించి సుమారు 77 శాతం పోలింగ్ జరిగిందన్నారు. ఈ పోలింగ్ సరళిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థి రామచంద్రా రెడ్డి,ఒంటేరు శ్రీనివాస రెడ్డిలు పరిశీలించారు. ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి, రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ రమణయ్యలు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు. **వెలుగోడు:** మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉప తాహసీల్దార్ శ్రీనివాసులు, వెలుగోడు ఎస్ఐ జగన్మోహన్ పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రామీణ-పట్టణ వాసుల ఓటర్లకు రెండు భాగాలుగా పోలింగ్ బూతులు నిర్వహించారు. మొత్తం 78.60 శాంతం పట్టాభద్రుల పోలింగ్ జరిగింది. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని బాలికల ఉర్దూ పాఠశాలలో ప్రత్యేక పోలింగ్ బూతును ఏర్పాటు చేశారు. **ప్యాపిలి:** పట్టణంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. సిఐ శ్రీరాములు, ఎస్ఐ సీఎం రాకేష్ లు పోలింగ్ బూత్ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్యాపిలి పట్టణంలో తాహసిల్దార్ చంద్రశేఖర్ వర్మ, డిటి మారుతి, జలదుర్గం పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. పోలింగ్ అనంతరం తహసిల్దార్ చంద్రశేఖర్ వర్మ మాట్లాడుతూ ప్యాపిలి పట్టణంలొ 83.17 శాతం, జలదుర్గం 83.17 శాతం నమోదయిందని తెలిపారు. ఉపాధ్యాయులు 25కు25 మంది ఓటు వేసి 100 శాతం వినియోగించుకు న్నారని తెలిపారు. **కొత్తపల్లి :** మండల కేంద్రంతో పాటు ముసలమడుగు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టబద్రులు మండలంలో మొత్తం 830 మందికి గాను 652 మంది ఓటు హక్కు వినియోగించు కోగా 78.55 శాతం, ఉపాధ్యాయులు 42 మందికి గాను 42 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 100 శాతం ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయింది. ఎమ్మెల్సీ ఎన్నికల తనిఖీలను తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఆత్మకూరు సిఐ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మేరీ, ఎన్నికల అధికారులు పలు శాఖల అధికారులు ఉన్నారు. **డోన్ :** పట్టణంలోని శ్రీ సుధ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు 162 పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఓటర్లు 230కి 218 మంది ఓటును వినియోగించుకున్నట్లు ఆర్‌డిఓ వెంకటరెడ్డి తెలిపారు. 303వ పోలింగ్ కేంద్రంలో 75.68 శాతం, 304 పోలింగ్ కేంద్రంలో 83.07 శాతం, 304ఎ పోలింగ్ కేంద్రంలో 74.16 శాతం, 305 పోలింగ్ కేంద్రంలో 70.54 శాతం పోలింగ్ నమోదు అయ్యిన్నట్లు పేర్కొన్నారు. **పాములపాడు :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ హైస్కూల్ నందు నిర్వహించిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్స్ తమ ఓటు హక్కును ఎంత ఉత్సాహంగా వచ్చి వినియోగించుకున్నారు ఎండలు సైతం లెక్కచేయకుండా క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో పట్టభద్రులు 951 మంది ఓటర్స్ ఉండగా 716 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పురుషులు 543, స్త్రీలు 173 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 75.3 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. టీచర్స్ ఓట్లు 36 ఉండగా.. 35 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా అడిషనల్ ఎస్పీ రమణ, సెక్టోరియల్ ఆఫీసర్ ఆంజనేయ పరిశీలించారు. ఎమ్మెల్సీ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో సుమిత్రమ్మ లు పర్యవేక్షించారు. ఎస్సై అశోక్ బందోబస్తు నిర్వహించారు. **పగిడ్యాల :** మండల కేంద్రం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 306 పోలింగ్ బూతులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లను, 163 పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 1256 పట్టభద్రుల ఓటర్ల గాను 974 పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. 77 ఉపాధ్యాయ ఓటర్ల గాను 73 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ విధించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. **గడివేముల :** మండల కేంద్రమైన గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలం మొత్తం 962మంది పట్టభద్రులకు గాను759 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓట్లను 43 మందికి గాను 43 మంది ఓటు హక్కును 100 శాతం వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను మొత్తం 759 మందిలో 162 మంది మంది పురుషులు ఓటు హక్కును వినియో గించుకున్నారు. మండలంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు. **నందికొట్కూరు :** మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టబద్రులు 79.42 శాతం, అదేవిధంగా టీచర్స్ 95.32 శాతం ఓటు హక్కును ఓటింగ్ నమోదైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఓటు వేస్తున్న ఎంపి పోచ బ్రహ్మానంద రెడ్డి

ఓటు హక్కును వినియోగించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వికలాంగుడిని తీసుకెళ్తున్న దృశ్యం

భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పి